RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 22 | పేజీలు : 4 | ఆదివారం 26 జులై 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



## విద్యార్థులపై ప్రాణాంతక దాడికి అనుమతిచ్చింది మీరు కాదా?

- అమిత్ షాకు రాహుల్ గాంధీ ఘాటు లేఖ
- కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లేఖ
- జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై దాడిని ఖండించిన రాహుల్
- శాంతియుత నిరసనపై పెల్లెట్ గన్లు వాడారని తీవ్ర ఆరోపణ
- దాడికి అనుమతి ఎవరు ఇచ్చారో చెప్పాలని లేఖలో డిమాండ్
- మహిళా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శ

# నేటి నుంచి టీడీపీ ఇంటింటి ప్రచారం



- నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్.
- రెండేళ్ల కూటమి పాలనపై నేటి నుంచి 45 రోజుల పాటు డోర్ టు డోర్ ప్రచారం
- ప్రభుత్వ విజయాలను, హామీల అమలును ప్రజలకు వివరించాలని నేతలకు చంద్రబాబు ఆదేశం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలూ గెలవడమే లక్ష్యంగా పనిచేయాలని సూచన
- అనుచరులుగా కాదు, నాయకులుగా ఎదగాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- గొడ్డలి పార్టీ విధ్వంసకర విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని దిశానిర్దేశం

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రేపటి నుంచి (సోమవారం) 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'డోర్ టు డోర్' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ ముఖ్యనేతలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ బృహత్ కార్యక్రమంలో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంత్రుల నుంచి బూత్ స్థాయి కన్వీనర్ల వరకు పార్టీ యంత్రాంగం మొత్తం ఈ అవుట్ రీచ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని గుర్తుచేశారు. "94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్లతో మనం గెలిచాం. నాటి ప్రభుత్వ విధ్వంసం, ఘోర తప్పిదాల వల్లే 151 సీట్ల పార్టీ 11 సీట్లకు పడిపోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు. కూటమి పార్టీల పోరాటాలు, ఎన్నికల వ్యూహాల వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని తెలిపారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. "ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఎలాగైతే ప్రతి ఇంటికీ వెళ్లారో, ఇప్పుడు కూడా అదే విధంగా వెళ్లి మనం ఇచ్చిన హామీలను ఎలా అమలు చేస్తున్నామో చెప్పాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి" అని సూచించారు.

## కేంద్ర నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి



## మన యువశక్తిని చూసి గర్వపడుతున్నా

- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ
- దేశ యువశక్తిపై గర్వంగా ఉందన్న ప్రధాని మోదీ
- 'మన్ కీ బాత్'లో యువత సాధించిన విజయాల ప్రస్తావన
- 'విక్రమ్-1' ప్రయోగంతో అంతరిక్ష రంగంలో నవశకం
- సైన్స్ ఒలింపియాడ్స్‌లో స్వర్ణ పతకాలతో సత్తా చాటిన విద్యార్థులు



## కార్గిల్ వీరులకు చంద్రబాబు, పవన్ నివాళి



కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రాణత్యాగం చేసిన సైనికుల అసమాన ధైర్యసాహసాలను, త్యాగాలను వారు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ మేరకు ఇరువురు నేతలు సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తమ సందేశాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందిస్తూ.. "అసాధారణ ధైర్యసాహసాలతో దేశానికి ఘన విజయాన్ని అందించిన యోధులకు నివాళులు అర్పిస్తున్నాను. అత్యంత దుర్భేద్యమైన భూభాగం, ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడారు. వారి అత్యున్నత త్యాగం, అసమాన పరాక్రమం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఇది భారతీయ దేశభక్తికి, జాతీయ గర్వానికి శాశ్వత ప్రతీకగా మిగిలిపోతుంది" అని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సందేశంలో పేర్కొంటూ.. "అసాధారణ శౌర్యంతో, నిస్వార్థ త్యాగంతో త్రివర్ణ పతాక గౌరవాన్ని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడిన అమరవీరులకు వినమ్ర నివాళులు. కార్గిల్ కేవలం ఒక యుద్ధ విజయం మాత్రమే కాదు.. అది అజేయమైన ధైర్యానికి, భారతదేశ అచంచల స్ఫూర్తికి నిదర్శనం. మన పవిత్ర మాతృభూమిలోని ప్రతి అంగుళాన్ని మన సైనిక యోధులు ప్రాణాలకు తెగించి తిరిగి స్వాధీనం చేసుకున్నారు.



## 'సర్' ఎన్యూమరేషన్ ఫారం తిరిగివ్వకుంటే ఓటు పోయినట్లే!

- ఎన్యూమరేషన్ పత్రాల సేకరణకు బీఎల్‌వోల అవస్థలు
- జోరందుకున్న సర్ డిజిటలైజేషన్ ప్రక్రియ
- ఎన్యూమరేషన్ పత్రాల సేకరణకు ఒక్కో ఇంటికి మూడుసార్లు వెళుతున్న బీఎల్‌వోలు

రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతోంది. ఇంటింటికి పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగి సేకరించేందుకు పలుచోట్ల బీఎల్‌వోలు అవస్థలు పడుతున్నారు. బూత్‌ల వారీగా ఉన్న ఓటర్లు, ఫామ్‌లను లెక్కల్లోకి తీసుకుని అన్నింటిని డిజిటలైజ్ చేయాల్సి ఉండగా, కొన్నిచోట్ల ఓటర్ల నుంచి స్పందన కరవైంది.

# నత్తనడకన రేషన్ కార్డుల ఈ-కేవైసీ



- అప్రమత్తం కాకుంటే ఇబ్బందే
- 5, 8 ఏళ్ల పిల్లలకు ఈ-కేవైసీ మినహాయింపు
- వేలిముద్రలు లేని వారు బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచన
- ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు సమీప రేషన్ దుకాణాల్లో పూర్తిచేయాలి

రేషన్ కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ప్రతి యూనిట్ లబ్ధిదారుడు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని అధికారులు చెబుతున్నా, కొందరు స్పందించడం లేదు. ఈనెల చివరి వరకు గడువు ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే గత వారానికి, ప్రస్తుత పరిస్థితిలో పెద్దగా మార్పు లేదని తెలుస్తోంది.

**5 ఏళ్ల పిల్లలకు మినహాయింపు**

ఐదేళ్ల వయసున్న చిన్నారులు, 8 సంవత్సరాల పిల్లలకు కూడా కేవైసీ చేయించాల్సిన అవసరం లేదు. అయితే ఈ పిల్లల్లో వేలిముద్రలు, ఐరిస్ వస్తే డీలర్ వద్ద నమోదు చేయిస్తే సరిపోతుంది. ఎనిమిదేళ్ల కంటే ఎక్కువ వయసున్న పిల్లలు మాత్రం తప్పకుండా ఈ-కేవైసీ పూర్తి చేయాలని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ చేసుకోకపోతే బియ్యం కోటా తగ్గడం లేదా ఏవైనా ఆంక్షలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాలి**

ఇప్పటివరకు ఉన్న లబ్ధిదారుల్లో కొంతమందికి వేలిముద్రలు రావటం లేదు. ఇలాంటి వారు బయోమెట్రిక్ వివరాలను తప్పకుండా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. దగ్గర్లోని ఆధార్? కేంద్రానికి వెళ్లి ఈ ప్రక్రియను పూర్తి చేయాలి. దీంతో రెండు రోజుల్లో బయోమెట్రిక్? పూర్తవుతోంది. అయితే కొందరికి వేలి ముద్రలు అసలే ఉండవు. అలాంటివారు ఐరిస్ ద్వారా నమోదు చేసుకోవచ్చని సూచించారు.

## తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు

- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
- సర్వదర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం
- వైకుంఠం కాంప్లెక్స్‌లు నిండి శిలాతోరణం వరకు క్యూలైన్లు
- శనివారం 84 వేల మందికి పైగా భక్తులకు శ్రీవారి దర్శనం
- నిన్న రూ. 3.78 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం



ఆదివారం 26 జూలై 2026

సీమ వార్త
సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

# రన్ అండ్ రైడ్‌లో మేము సైతం..!!

.....గోరంట్ల మండలం నుండి 1,680 మంది పాల్గొని విజయవంతం.

జిల్లా మహిళా కోఆర్డినేటర్ విజయాశివారెడ్డి ఆధ్వర్యంలో తరలి వెళ్ళిన వైనం.

పుట్టపర్తిలో... అందరి మదిలో ఆరోగ్య చైతన్యం సామాజిక బాధ్యత సేవా బావం.






**గోరంట్ల ( పుట్టపర్తి) జులై 26 సీమ వార్త సాయంత్రం.**

పుట్టపర్తిలో నిర్వహించిన "రన్ అండ్ రైడ్" కార్యక్రమంలో గోరంట్ల మండలం నుండి మొత్తం 1,680 మంది విద్యార్థులు, యువత, మహిళలు, సేవాదళ్ సభ్యులు మరియు వివిధ గ్రామాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా మహిళా కోఆర్డినేటర్ డా. విజయ వెంకట శివారెడ్డి నాయకత్వంలో అత్యంత క్రమశిక్షణతో నిర్వహించబడింది. గోరంట్ల మండలంలోని అన్ని గ్రామాల నుండి పాల్గొన్న వారిని సమన్వయం చేయడంలో గోరంట్ల కన్వీనర్ శ్రీ సుబ్బారాయుడు విశేష కృషి చేశారు.ఆరోగ్య చైతన్యం, సామాజిక బాధ్యత, సేవాభావం మరియు ఐక్యతను పెంపొందించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారుల నుండి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. గోరంట్ల మండల ప్రజల భాగస్వామ్యం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా డా. విజయ వెంకట శివారెడ్డి మాట్లాడుతూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గోరంట్ల మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు, పాఠశాలల యాజమాన్యాలకు, ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, సేవాదళ్ సభ్యులకు, మహిళా విభాగ సభ్యులకు, స్వచ్ఛంద సేవకులకు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు

# హిందుస్థాన్‌లో పరేషాన్!



....ఓడిసి హెచ్ పి పెట్రోల్ బంకులో నిర్వాకం...

....వినియోగదారుల నెత్తిన సెటగోపం.

....హెచ్ పి...పెట్రోల్ బంకులో కొరవడిన పర్యవేక్షణ.

....సిబ్బంది ఆడిందే ఆట ..పాడిందే పాట

.....లీటర్ పెట్రోల్ కు డబ్బులు చెల్లిస్తే... వేసేది 800 ఎమ్.ఎల్ మాత్రమే.

.....డిజిటల్ పేమెంట్... అడిగితే నో అని సమాధానం.

**ఓబులదేవరచెరువు (జూలై29)సీమవార్త సాయంత్రం**

స్థానిక హెచ్ పి పెట్రోల్ బంకు నిర్వాహకుల నిర్వాక ఫలితంగా వినియోగదారుల నెత్తిన శటగోపం పెడుతున్నారని వినియోగదారులు లబోదిబో మంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సివిల్ సప్లై శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న హెచ్ పి పెట్రోల్ బంకులో...పెట్రోల్ పట్టే సిబ్బంది వినియోగదారుల పట్ల తీవ్రమోసం చేస్తున్నారన్న విమర్శలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి.సంబంధిత పెట్రోల్ బంక్ అధికారి కనీసం వారంలో ఒక రోజు కూడా పర్యవేక్షణ చేయకపోవడంతో పెట్రోలు పట్టే సిబ్బంది కస్టమర్ల వద్ద నగదు ఇప్పించుకుని అందుకు తగిన పెట్రోల్ వెయ్యకుండా కొలతల్లో కోత విధించి మోసం చేస్తున్నారు.ఇదేమని ప్రశ్నిస్తే.... మీ వాహనం రిపేరు లో ఉంది, మైలేజ్ రావడం లేదు అంటూ.... - మిగతా3లో






# 10 వ తరగతి విద్యార్థిని కి గర్భం..!!

మైనర్ బాలికకు గర్భం చేసిన... ఇద్దరు భార్యలు ఇద్దరు పిల్లలు ఉన్న మృగం.

హిందూపురంలో చికిత్సల అనంతరం గోరంట్ల పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు.

విష్మయాన్ని కలిగిస్తున్న ఘటన... బాలికకు న్యాయం జరిగేది ఎలా.

**గోరంట్ల జులై 26 సీమ వార్త సాయంత్రం.**

పదవ తరగతి చదువుతున్న మైనర్ బాలిక గర్భం దాల్చిన ఘటన గోరంట మండలంలో ఒక్కసారిగా చర్చనియంసం గా మారింది. గోరంట్ల పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన దళిత విద్యార్థి గర్భం దాల్చిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.బాధిత బాలిక తల్లిదండ్రులు ఈ సంఘటనపై గోరంట్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. వివరాల్లోకెళితే గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన దళిత కుటుంబంలోని ఓ మైనర్ బాలిక ను అదే గ్రామానికి చెందిన ఇద్దరు భార్యలు ఇద్దరు పిల్లలు ఉన్న వ్యక్తి ఆ మైనర్ బాలిక గర్భవతి కావడానికి కారణంగా తెలుస్తోంది. ఈ అంశాన్ని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులు కనపరిచినట్లు సమాచారం. ఈ సంఘటనపై పోలీసుల దర్యాప్తులో వాస్త విషయాలు తెలియాల్సి ఉంది.

# త్వరలో ఆప్కో ఎన్నికలు!



రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత.. చేనేత సహకార సంఘ ఎన్నికలు జరుపుతాం

అర్హులందరికీ నేతన్న సేవలో...ఆర్థిక సాయం.. నేతన్నల సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన

ప్రగడ కోటయ్య స్ఫూర్తితో చేనేత రంగ అభివృద్ధి.. చేనేతలకు ఎప్పుడూ సీఎం చంద్రబాబు పాలన స్వర్ణయుగమే

చేనేతలను మోసగించిన జగన్.. వైసీపీ కార్యకర్తలకు నేతన్న నేస్తం నిధులు : మంత్రి సవిత మండిపాటు

చీరాలలో ఘనంగా ప్రగడ కోటయ్య రాష్ట్ర జయంతి వేడుకలు.. ప్రగడ కోటయ్య కుటుంబీకులకు ఘన సత్కారం







సీమ వార్త సాయంకాలం
ఆదివారం
26 జూలై 2026

## బీఆర్ఎస్ డబుల్ బెడ్ రూమ్...

**హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరంలో సొంతింటి కోసం దశాబ్దాలుగా నిరీక్షిస్తున్న పేద, దిగువ మధ్యతరగతి ప్రజలను మరోసారి రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా స్కెచ్ వేసింది. నగర నడిబొడ్డున ఇందిరమ్మ టవర్స్ పేరుతో రూ. 40 నుంచి రూ. 60 లక్షల విలువైన ఫ్లాట్లను కేవలం రూ. 6 లక్షలకే ఇస్తామంటూ సరికొత్త సెంటిమెంట్ రగిలిస్తోంది. రూ. 5 లక్షల సబ్సిడీ, రిజర్వేషన్ల శాతం, మీ-సేవ దరఖాస్తులు అంటూ సుదీర్ఘమైన నిబంధనల జాబితాను ప్రకటిస్తూ.. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ స్కీమ్ తెరపైకి తెచ్చారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.గతంలో కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి, లక్షలాది మంది నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఓట్ల పండగ ముగిశాక పేదలను నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన అరకొర ఇళ్లకు పరిమితం చేసింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే కేసీఆర్ ఫార్ములా ను కాస్త రూపుమార్చి అమలు చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఉచితం అని చెప్పకుండా.. రూ. 6 లక్షల భాగస్వామ్యం పేరుతో ప్రజల నుంచి ఆశలు రేకెత్తించి, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి ఈ దరఖాస్తుల హంగామా అని ఎక్కువ మంది నమ్ముతున్నారు.ప్రస్తుతం తొలి విడతగా 16 నియోజకవర్గాల్లో ఈ ఇందిరమ్మ టవర్స్ కడతామని చెబుతున్న ప్రభుత్వం, అసలు ఇళ్లకు సరిపడా భూములు ఎక్కడ ఉన్నాయో స్పష్టం చేయడం లేదు.

## హిందుస్థాన్‌లో పరేషాన్..!!

-మొదటిపేజీ తరువాయి

దాటవేత ధోరణి అవలంబిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.కనీసం మోసపోయిన కస్టమర్లు ఫిర్యాదు చేయాలన్న అక్కడ సంబంధిత అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడం కొసమెరుపు .సదరు పెట్రోల్ బంకులో ఇలా అక్రమాలు,మోసాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్న విమర్శలు లేకపోలేదు. పెట్రోల్ బంకు ప్రారంభం నుండి ఇక్కడ డిజిటల్ పేమెంట్ సౌకర్యం లేదు. అనగా ఫోన్ పే,పేటీఎం వంటి డిజిటల్ పేమెంట్ లేకపోవడం గమనార్హం. డిజిటల్ సౌకర్యం ఏర్పాటు చేయాలని పలుమార్లు వినియోగదారులు సంబంధిత సివిల్ సప్లై శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. డిజిటల్ పేమెంట్ సౌకర్యం ఏర్పాటు చేస్తే ప్రభుత్వ సొమ్ము కాజేసేందుకు వీలు కుదరదని కేవలం క్యాష్ పేరుతో మాత్రమే ఇక్కడ అక్రమ వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా. విరాజిల్లుతోందన్న విమర్శలు లేకపోలేదు ఇలా అప్పటికప్పుడు నగదు ఇప్పించుకొని సిబ్బంది కస్టమర్లకు నగదు కంటే తక్కువ పెట్రోలు వేసి మిగిలిన మొత్తాన్ని నొక్కేస్తూ తమ జేబులు నింపుకుంటున్నారన్న సంగతి సర్వత్ర చర్చ నియాంశమైంది.సదరు సంబంధిత పెట్రోల్ బంకులు ఇలా సంవత్సరాలుగా మోసం,అక్రమాలు జరుగుతున్నా కనీసం సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు కల్పించుకుని ఓడి చెరువు హెచ్ పి పెట్రోల్ బంక్ లో జరుగుతున్న దోపిడి నుంచి ప్రజలకు విముక్తి కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# త్వరలో ఆప్కో ఎన్నికలు..!!





**పుట్టపర్తి డెస్క్ ( చీరాల) జులై 26 సీమ వార్త సాయంత్రం.**
త్వరలో చేనేత సహకార సంఘాలతో పాటు ఆప్కో ఎన్నికలు కూడా నిర్వహించనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ప్రకటించారు. అర్హులైన నేతన్నలందరికీ నేతన్న సేవలో పథకం కింద రూ.25 వేల ఆర్థిక సాయం అందించనున్నామన్నారు. నేతన్నల సంక్షేమానికి సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు పాలన ఎప్పుడూ చేనేతలకు స్వర్ణయుగమేనన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అనర్హులకు కూడా నేతన్న నేస్తం పేరుతో ఆర్థిక సాయమందించిందని విమర్శించారు. ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ... ఆయన చేనేత రంగానికి చేసిన సేవలను భావితరాలకు తెలియజేస్తోందన్నారు. చీరాలలోని పద్మశాలీ కల్యాణ మండపంలో ప్రగడ కోటయ్య రాష్ట్ర స్థాయి జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య, ఎమ్మెల్సీ పోతుల సునీత, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖారాణి, బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తో కలిసి మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి ప్రజాబంధు ప్రగడ కోటయ్య చేసిన సేవలు మంత్రి సవిత గుర్తు చేశారు. నేతన్నల సమస్యల పరిష్కారానికి ప్రగడ కోటయ్య తుది శ్వాస విడిచేవరకూ పోరాడారన్నారు. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యునిగా చట్టసభల్లో చేనేతల వాణిని వినిపించారన్నారు. నాలుగు చేనేత సత్యాగ్రహాలను నిర్వహించిన పోరాట యోధుడని కొనియాడారు. ఆనాటి ప్రధాని జవహర్ నెహ్రూతో చీరాల స్పిన్నింగ్ మిల్లుకు శంకుస్థాపన చేయించారన్నారు. ప్రగడ కోటయ్య స్ఫూర్తితో అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారననారు. ప్రజాబంధు కోటయ్య సేవలను భావి తరాలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో ఆయన జయంతిని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర పండుగగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. చీరాలలో ప్రగడ కోటయ్య రాష్ట్రస్థాయి జయంతిని నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. చేనేతల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా కోటయ్య జయంతిని కూటమి ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందని మంత్రి సవిత తెలిపారు.

**త్వరలో ఆప్కో సహా చేనేత సహకార సంఘాల ఎన్నికలు**

రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్ని మంత్రి సవిత తెలిపారు. చేనేత సహకార సంఘాల బలోపేతంపై ఆయన దృష్టి సారించారన్నారు. త్వరలోనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టామన్నారు. తరవాత ఆప్కో ఎన్నికలు నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. చేనేత సహకార సంఘాలు బలోపేతమైతే నేతన్నలకు, కార్మికులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. చేనేత సహకార సంఘాల బకాయిలను సైతం చెల్లిస్తూ వస్తున్నామని తెలిపారు. రానున్న జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు కూడా చీరాలలోనే నిర్వహించే అవకాశముందని వెల్లడించారు. అమరావతిలో రూ.10 కోట్లతో ప్రగడ కోటయ్య స్మృతివనం ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు.

అర్హులందరికీ 'నేతన్న సేవలో...'

చేనేతలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన అని మంత్రి సవిత తెలిపారు. ఒకవైపు చేనేత రంగ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూనే, వ్యక్తిగతంగా నేతన్నలకు ఆర్థిక చేయూతనివ్వాలన్నది ఆయన సంకల్పమన్నారు. దీనిలో భాగంగానే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. చేనేతలకు పెన్షన్లు అమలుచేసిన ఘనత కూడా సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత గుర్తు చేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మగం నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మరమగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. వాటితో ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా ఏటా రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేసే నేతన్న సేవలో...పథకానికి శ్రీకారం చుదుతున్నామన్నారు. వచ్చే నెల ఏడో తేదీన జాయతీ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. అర్హులైన నేతన్నలందరికీ వయస్సు సంబంధం లేకుండా నేతన్న సేవలో పథకాన్ని వర్తింప జేస్తామన్నారు.

**చేనేతలకు జగన్ మోసం**


ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్... ఛ్లనేతలకు తీవ్రంగా మోసగించారని మంత్రి సవిత మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకాన్ని ఇష్టారాజ్యంగా అమలుచేసిందని విమర్శించారు. ఆనాటి టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నింటినీ రద్దు చేసి, కేవలం నేతన్న నేస్తం పథకం మాత్రమే అమలుచేసిందన్నారు. ఈ పథకం కింద అర్హులతో పాటు వైసీపీకి చెందిన ఫేక్ చేనేతలకు కూడా నేతన్న నేస్తం పథకం కింద ఆర్థిక సాయంతో పాటు పెన్షన్లు అందించిందన్నారు. సీఎంచంద్రబాబునాయుడు ఎప్పుడు కూడా చేనేతలకు స్వర్ణయుగమేనన్నారు. 2014-19లో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా చేనేతలకు మేలు చేసేలా పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత చేనేతలకు చేయూతగా నిలుస్తున్నామని తెలిపారు.

**ప్రగడ కోటయ్య కుటుంబీలకు ఘన సత్కారం**

అంతకుముందు కార్యక్రమం ప్రారంభం సందర్భంగా, ప్రజాబంధు ప్రగడ కోటయ్య విగ్రహానికి మంత్రి సవిత పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన ప్రగడ కోటయ్య తనయుడు వెంకటశేషసయిన,కోడలు పద్మావతి, కుమార్తెను, అల్లుడిని, ఇతర కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. మంత్రి సవితను స్థానిక ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య, ఎమ్మెల్సీ పోతుల సునీత, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖారాణి, బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేషన్ చైర్మన్లు నందం అబద్ధయ్య, చిలకలపూడి పాపారావు, పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జి.ధనుంజయరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో నేతన్నలు పాల్గొన్నారు.

# భారీగా పెరగనున్న ఆస్తి పన్ను...

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని భవనాలు, స్థలాల యజమానులకు ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు కొనసాగుతున్న ఆస్తిపన్ను అసెస్మెంట్ విధానంలో మార్పులు తీసుకువస్తూ పాలకవర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై సాంప్రదాయ అద్దె ప్రాతిపదికన కాకుండా.. మార్కెట్ రేట్లకు అనుగుణంగా పన్నులు వసూలు చేసేందుకు వీలుగా కొత్త బిల్లును సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదిత నిబంధనలు అమల్లోకి వస్తే.. పట్టణ ప్రాంతాల్లో నివాస, వాణిజ్య ఆస్తులపై పన్ను భారం ఊహించని రీతిలో పెరగనుంది. హైదరాబాద్ నగరంలోని ఇళ్ల, వాణిజ్య సముదాయాల యజమానులపై ఆర్థిక భారం పెరగనుంది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి స్వస్తి పలికి.. దానికి బదులుగా క్యాపిటల్ విలువ ఆధారంగా ఆస్తి పన్నును నిర్ణయించేందుకు ప్రభుత్వం సమగ్ర అర్బన్ రిఫార్మ్స్ (సీయూఆర్ఈ) ముసాయిదా బిల్లులో ప్రతిపాదనలు రూపొందించింది. ఈ నూతన సంస్కరణల వల్ల నగర పరిధిలోని నివాసాల యజమానులతో పాటు వాణిజ్య సముదాయాల యజమానులపై పన్ను భారం పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.కొత్తగా తీసుకురానున్న




'క్యూర్' ముసాయిదా బిల్లు ప్రకారం.. ఆస్తిపన్ను లెక్కించడానికి రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే భూమి, భవనాల క్యాపిటల్ విలువనే ప్రధాన ప్రాతిపదికగా తీసుకోనున్నారు. సాధారణంగా రియల్ ఎస్టేట్ రంగానికి అనుగుణంగా మార్కెట్లో భూముల ధరలు, భవనాల విలువలు ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంటాయి. దీనివల్ల పన్ను శాతాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పెంచకపోయినా, భూముల మార్కెట్ విలువ పెరగడం వల్ల ఆస్తి పన్ను కూడా ప్రతి ఏటా ఆటోమేటిక్‌గా పెరుగుతూ పోతుంది.ఈ కొత్త ముసాయిదా చట్టంలో ఆస్తుల రకాన్ని బట్టి పన్ను శాతాలను ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇళ్లకు సంబంధించి క్యాపిటల్ విలువపై 0.10 శాతం నుంచి 0.50 శాతం వరకు పన్ను స్లాబ్‌లను వర్తింపజేయాలని ప్రతిపాదించారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు సంబంధించి క్యాపిటల్ విలువలో 0.20 శాతం నుంచి గరిష్టంగా 2.00 శాతం వరకు పన్ను స్లాబ్‌లను విధించనున్నట్లు స్పష్టం చేశారు.ఈ ప్రతిపాదిత విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే నగరంలో ఆస్తులు ఉన్న వారిపై ఆర్థికంగా ప్రభావం పడే అవకాశం ఉంది. పెరుగుతున్న భూముల రేట్లకు అనుగుణంగా ఏటా పన్ను పెరిగే నిబంధన ఉండటంతో.. భవిష్యత్తులో పన్ను భారం మరింత పెరగనుందని స్పష్టం అవుతోంది. అది జరిగితే యజమానులు తమపై పడే పన్ను భారాన్ని అద్దెలు పెంచడం ద్వారా పూడ్చుకోవడానికి ప్రయత్నిస్తారు. దీని వల్ల అంతిమంగా భారం అద్దెదారులపైనే పడే అవకాశం ఉంటుంది.

## మండలంలో ఎస్ ఐ ఆర్ సర్వే ద్వారా 5322 ఓట్లు తొలగింపు



**అమరాపురం జులై 26 సీమవార్త** మండల వ్యాప్తంగా ఉన్న 9 గ్రామ రెవెన్యూ పంచాయతీల పరిధిలో 52 పోలింగ్ బూత్లలో 47,279 ఓట్లు ఉన్నాయి. కేంద్ర ఎన్నికల కమిషన్ బి ఎల్ వో ల ద్వారా నిర్వహిస్తున్నటువంటి ఎస్ఆర్ఐ సర్వే ద్వారా 5322 ఓట్లను మండల వ్యాప్తంగాతొలగించినట్లు అధికారుల ద్వారా సమాచారం అందింది. ప్రస్తుతం జరిగిన సర్ కార్యక్రమంలో 1988మృతి చెందినవి, 1728వలసలు,589డూప్లికేట్ ఓట్లు, 1012ఆచూకీ లేనివారు , ఇతరులు 5 ఓట్లు ప్రకారం 5322 ఓట్లు తొలగించడం జరిగిందని వీఎల్వోల పరిధిలో జరిగిన గ్రామసభల్లో కూడా అఖిలపక్ష నాయకుల సమక్షంలో వివరించినట్లు అధికారులు తెలిపారు. ఎస్ఆర్ఐ తర్వాత 41957 ఓట్లు అధికారకంగా ఉన్నట్లు తెలుస్తుంది. మండలంలో క్షుణ్ణంగా ఎస్ఆర్ఐ కార్యక్రమాన్ని నిర్వహించినట్లుతహశీల్దార్ బి.హనుమంతు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 52 పోలింగ్ కేంద్రంలోనూ ఒక్కొక్క బూత్ కి ఒక్కొక్క బిఎల్ఓ ని ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమలేషన్ పత్రాలను అందజేసి స్థానిక ఇంటి యజమాని అందించిన వివరాల మేరకు ఈ సర్వేను నిర్వహించామని ఆయన తెలియజేశారు. ఈ సర్వే పూర్తి కావడంతో మండలంలో 5322 ఓట్లు తొలగించినట్లు ఆయన తెలియజేశారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

## మేం సాధించాం.. ఇది విద్యార్థుల విజయం

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చేపట్టిన విద్యార్థుల ఆందోళనలతో దిగొచ్చిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. మరోవైపు ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) హర్షం వ్యక్తం చేసింది. ఇది విద్యార్థుల విజయమని, ప్రజాస్వామ్యం అంటే ఇదేనని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మేం దీన్ని సాధించాం. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇదే మొదటి రాజీమానా. మనం భయపడకుండా, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే ఎవరి చేతనైనా రాజీనామా చేయించగలమనేదానికి ఇదే నిదర్శనం. శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. ఈ విషయాన్ని మహత్మ గాంధీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలితానిచ్చింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఇది విద్యార్థుల విజయం. ప్రజాస్వామ్యం అంటే ఇదే' అని దీప్కే అన్నారు.

**'మిగిలిన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం ఆగదు'**

అయితే తమకు రాజకీయాలు అవసరం లేదని దీప్కే అన్నారు. తమ తీసుకొచ్చిన మూడు డిమాండ్లల్లో ఒకటి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనా చేశారని, మిగిలిన రెండు నెరవేరే వరకు వేచి చూస్తామని తెలిపారు. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలని, ఆత్మహత్య చేసుకున్న వారికి పరిహారం వచ్చే వరకు ఈ ఉద్యమం ఆగదని వెల్లడించారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దామని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

**స్పందించిన సోనమ్ వాంగ్‌చుక్**

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్ స్పందిస్తూ, ఇది నేరుగా ప్రజల నుంచి ఉద్భవించిన ప్రజాస్వామ్య విజయమని అన్నారు. భయాన్ని వీడినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సీజేపీ, జెన్‌జీకి అభినందనలు తెలిపుతూ ఎక్స్?లో పోస్ట్ చేశారు. జవాబుదారీతనం నుంచి ఇప్పుడు సంస్కరణల దిశగా మారిందని అన్నారు.

**ఇది మోదీ మొండితనానికి పరాజయం : ఖర్గే**

మరోవైపు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామపై కాంగ్రెస్ కూడా స్పందించింది. ఇది ప్రజాస్వామ్య విజయమని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్?లో పోస్ట్ చేశారు. విద్యా వ్యవస్థను సరిదిద్దడం కోసం విద్యార్థులు ధైర్యంగా పోరాడారని అన్నారు. ఇది సత్యం సాధించిన విజయమని, ప్రధాని మోదీ మొండితన ఎదుర్కొన్న పరాజయమని అన్నారు. ఇప్పుడు యువతకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాల్సిన వంతు వచ్చిందని, వారిపై లాఠీలు, దండాలు, పెల్లెట్? గన్?లను ప్రయోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి బాధ్యత కూడా ఆయనదే అని అన్నారు. విద్యాశాఖ మంత్రి రాజీమానాతో ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం నుంచి నిరవధికంగా తప్పించుకోలేమని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. విద్యా రంగంలో పారదర్శక సంస్కరణలు, సంస్థాగత బాధ్యత ఉండాలని పిలుపునిచ్చారు.

**ప్రజాస్వామ్యం, యువత విజయం : కేజ్రీవాల్**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ఆమ్ ఆద్మీపార్టీ స్వాగతించింది. ఇది విద్యార్థులు, యువత, ప్రజాస్వామానికి లభించిన విజయమని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ప్రభుత్వం ప్రజల వాణిని వినాలని, పేపర్ లీక్‌లను నివారించడానికి చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు ఎక్స్?లో వీడియో పోస్ట్ చేశారు. యువత ఉద్యమం కారణంగానే మంత్రి రాజీనామాను ప్రభుత్వం అంగీకరించాల్సి వచ్చిందని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ ఉద్యమం ఇప్పుడు ఉద్యోగాల కల్పనకు కూడా విస్తరిస్తుందని, ప్రతి తప్పుకు జవాబుదారీతనం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## విద్యార్థుల అన్ని డిమాండ్లకు కేంద్రం ఓకే

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై శనివారం కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మధ్య జరిగిన చర్చలు ఎట్టకేలకు సఫలమయ్యాయి. సీజేపీ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. విద్యార్థులపై పెట్టిన కేసులను క్రమంగా ఎత్తివేస్తామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రకటించారు. దిల్లీ, మిగతా రాష్ట్రాల్లో నమోదైన కేసులు ఎత్తివేస్తామని, భవిష్యత్తులోనూ ఎవరినీ కేసులతో వేధించబోమని స్పష్టం చేశారు. అలాగే, బాధిత కుటుంబాలకు పరిహారంపై చర్చించామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో పరీక్షల నిర్వహణ విషయంలో సీజేపీతో చర్చిస్తామని వెల్లడించారు. దిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో కేంద్రం, సీజేపీ మధ్య జరిగిన మూడో విడత చర్చల్లో కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్రసింగ్, సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా పాల్గొన్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం సమావేశ వివరాలను సంయుక్తంగా మీడియాకు వెల్లడించారు.

"నాలుగు పాయింట్ల ప్రధాన సారాంశం ఏమిటంటే నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు. ఒకవేళ ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఉంటే వాటిని ఉపసంహరించుకోవాలి. ఈ కేసులు దిల్లీ పోలీసుల ద్వారా నమోదైనా లేదా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ నమోదైనా సరే ఆ ఎఫ్ఐఆర్ కాపీలను మేము వారికి అందిస్తాం. నిరసనల సమయంలో ఆందోళనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడానికి, వారిపై ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటానికి ప్రభుత్వం అంగీకరించింది. భవిష్యత్తులో కూడా ఆందోళనల నిర్వాహకులు, నిరసనకారులపై ఈ కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి కేసులు నమోదు చేయకూడదని మేము అంగీకరించాం. వారు ప్రస్తావించిన రెండో అంశం పరిహారానికి సంబంధించినది. ఈ పరిహారం చెల్లింపుపై ప్రభుత్వం తన వైఖరిని చాలా స్పష్టంగా తెలియజేసింది. నిబంధనలు లోబడి సాధ్యమైనంత పరిహారాన్ని అందిస్తాం."

**'ఆందోళనకారులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోండి'**

మరోవైపు, చర్చలు సఫలం కావడంతో ఆందోళన విరమిస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. కేంద్రం తమ డిమాండ్లు నెరవేరుస్తామని మంగళవారం నాటికి గ్యారంటీ ఇస్తామని ప్రకటించడంతో ఆందోళనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోశ్? రంకా ప్రకటించారు. మరోవైపు, తమ ఐదు సూత్రాల డిమాండ్ల పత్రాన్ని ప్రభుత్వానికి సీజేపీ ప్రతినిధులు సమర్పించారు. నాలుగు వారాల తర్వాత తదుపరి విడత చర్చలు జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై సీజేపీ ప్రతినిధి అశుతోశ్? రాంకా

# టిడిపి డి2డి కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలను వివరించండి



**అమరాపురం జూలై 26 సీమవార్త సాయంత్రం** అమరాపురం తెలుగుదేశం నాయకుల, కార్యకర్తలతో ఆదివారం టిడిపి కార్యాలయం నందుఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మరియు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాలమేరకు డోర్ టు డోర్ టిడిపి కార్యక్రమంపై ప్రత్యేక సమావేశాన్ని టిడిపి మండల కన్వీనర్ కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల సింగల్ విండో అధ్యక్షుడు గణేష్, మండల ప్రధాన కార్యదర్శిఎం. నాగరాజు, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, జడ్పిటిసి పి ఆర్ నరసింహమూర్తి, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు రఘు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్, సింగల్ విండో అధ్యక్షుడు లు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను సోమవారం 27వ తేదీ నుండి నుండి 45 రోజులపాటు ప్రతి గ్రామంలోనూ ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో ద్వారా వివరించాలని వారు పేర్కొన్నారు. ప్రతిరోజు 30 ఇండ్ల వంతున సందర్శించి మై టిడిపి ఆప్ ద్వారా ఫోటోతో కూడినవివరాలను నమోదు చేయాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ముఖ్యంగా కరపత్రికలను ప్రతి ఇంటింటికి అందజేసి సూపర్ సిక్స్ పథకం ద్వారా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని వారు తెలిపారు. ప్రజల యొక్క సమస్యలను ప్రత్యేకంగా నమోదు చేసుకొని వాటి పరిష్కారానికి కూడా చొరవ తీసుకోవడానికి కృషి చేద్దామని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి గ్రామంలోనూ వర్షాలు లేక నీటి కొరత ఉందని అయినా కూడా ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీల కృషితో బోర్లు కూడా వేసామని ప్రజలకు వివరించాలన్నారు. త్వరలోనే పింఛన్లు, ఇండ్లు మంజూరు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న తాగునీటి ఎద్దడి, నిద్రగట్టడీలర్ సమస్యలను నాయకులు సమావేశంలో ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా, డైరెక్టర్ దాదా పీర్,పంచాయతీ కన్వీనర్లు బిఎస్ నాగరాజ్, చంద్ర నాయక్,ఎల్ఐసి నాగరాజ్, తిప్పజ్జ, రవి ప్రకాష్, మాజీ సర్పంచులు ప్రకాష్, నిద్రగట్ట లోకేష్, కుమార్ స్వామి, నిద్రగట్ట హనుమంతరాయ, సెకునప్ప, గొల్లమారనపల్లి రామచంద్రప్ప,డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, శ్రీనివాస్, చెన్నబసప్ప, వివేక్,డీలర్లు జయన్న, రమేష్, హిమంత రాజు, టైలర్ రామాంజనేయులు, చెరువు సంఘం అధ్యక్షులు శివరామప్ప, వీరమల్లప్ప, మాజీ ఎంపిటిసి శివకుమార్, ఈరలింగప్ప, వీరపసముద్రం మంజన్న, చిట్టనడుకు మహాలింగప్ప తదితరులతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## రూ. 11లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ.



**పెనుకొండ జులై 26 సీమవార్త. సాయంత్రం** పట్టణంలో ని ఎంపి కార్యాలయం లో ఆదివారం నియోజకవర్గానికి చెందిన 7గురికి హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారధి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డబ్బులు తమ కుటుంబాలలో ఆప్తులు లను కోల్పోయిన కుటుంబాలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

## జూద కేంద్రం పై దాడి-34560 రు నగదు స్వాధీనం



**అమరాపురం జూలై 26 సీమవార్త సాయంత్రం** మండల పరిధిలోని బసవనపల్లి పంచాయతీ అరోనపల్లి తండా గ్రామ శివార్లలో జరుగుతున్న జూద కేంద్రంపై దాడి చేసి 5 మంది జూదరులను పట్టుకున్నట్లు ఎస్సై వలీభాష తెలిపారు. పట్టుబడ్డ వారి వద్ద నుండి రూ. 34,560 నగదు మరియు 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు, మిగిలిన 10 మంది జూదరులు పరారైనట్లు ఎస్సై తెలిపారు. మండలంలో ఎక్కడైనా గాని జూదం మట్కా గ్యాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే ప్రజలు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

## నేటి నుండి ఇంటింటికి తెలుగు దేశం.



**పెనుకొండ జులై 26 సీమవార్త. సాయంత్రం** ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించేందుకు సోమవారం నుండి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ని తిమ్మాపురం లో నేటినుండి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి బూత్ పరిధిలోని అన్ని కుటుంబాలను సందర్శించి మై టీడీపీ యాఫ్ లో నమోదు చేయవలసి ఉంటుందన్నారు. ప్రతి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రామాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

## రేపటి నుంచి ప్రారంభమయ్యే డోర్-టు-డోర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి



**మడకశిర జూలై 26 సీమ వార్త సాయంత్రం** తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రేపటి నుంచి ప్రారంభమయ్యే డోర్-టు-డోర కార్యక్రమాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి , కుంచిటి వక్కలుగా రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్సీ ఇంటిలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్త పార్టీకి రాయబారిగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ డోర్-టు-డోర్ కార్యక్రమాన్ని సమిష్టిగా విజయవంతం చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు నాగరాజు, ఈరన్న, తిప్పేస్వామి, మండల కన్వీనర్ నాగరాజు, లక్ష్మీ నర్సప్ప సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, నరేష్ కన్నా, మద్దన కుంటప్ప, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఊరి చివర ఉరివేసుకొని రమేష్ నాయక్ మృతి.



**గోరంట్ల జులై 26 సిమ వార్త. సాయంత్రం.** గోరంట్ల మండలంలోని మల్లాపల్లి పంచాయతీ పరిధిలోని కలగేరి తండాకు చెందిన నారాయణ నాయక్ కుమారుడు రమేష్ నాయక్ (33) గ్రామ చివర ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రమేష్ నాయక్ కు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం. అయితే శనివారం కుటుంబంలో జరిగిన చిన్న వాదోపవదాలకు మనస్థాపానికి చెందిన మృతుడు గ్రామ చివర ఉరి వేసుకున్నాడని సకాలంలో గమనించిన సమీపవాసులు 108 ద్వారా గోరంట్ల ఆసుపత్రికి తరలించారని అయితే అప్పటికే రమేష్ నాయక్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుగొండ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ సంఘటనపై పోలీసుల దర్యాప్తులో వాస్తవ విషయాలు తెలియాల్సి ఉంది.

## ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న...

## పానీ పూరి వ్యాపారి.



**గోరంట్ల జులై 26 సీమ వార్త సాయంత్రం** గోరంట్ల పట్టణంలో పానీపూరి వ్యాపారం ద్వారా జీవనం సాగిస్తున్న ఉత్తరప్రదేశ్ వాసి జోగేంద్ర సింగ్ (35) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే ఉత్తరప్రదేశ్ కు చెందిన జోగేంద్ర సింగ్ గత కొంతకాలంగా గోరంట్ల పట్టణంలో నివాసం ఉంటూ భార్య పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి తన నివాసంలో ఉడివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య రేఖా రాణి, పిల్లలు హాన్స్, ఈసు లు ఉన్నారు.శనివారం రాత్రి కుటుంబంలో జరిగిన చిన్నపాటి వాగ్దివాదానికి క్షణికావేశానికి లోనై ఉరి వేసుకున్నట్లు సమాచారం. పోలీసుల దర్యాప్తులో వాస్తవ విషయాలు తెలియాల్సి ఉంది.

## మాజీ కౌన్సిలర్ మల్లికార్జునను పరామర్శించిన తండ్రి కొడుకులు

**5 లక్షల సొంత ఖర్చుతో ఆపరేషన్ చేయించిన ఎమ్మెల్యే జెసి అష్మిత్ రెడ్డి**

**పరామర్శించడానికి పెద్దఎత్తున తరలి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు**



**తాడిపత్రి, జులై 25 సీమ వార్త సాయంత్రం :** తాడిపత్రి పట్టణం భగత్ సింగ్ నగర్ 30వ వార్డు మాజీ కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో హైదరాబాద్‌లోని స్టార్ హాస్పిటల్ నందు ఆపరేషన్ చేయించుకున్నారు. సుమారు 5 లక్షల రూపాయల ఆపరేషన్ ఖర్చును ఎమ్మెల్యే జెసి అష్మిత్ రెడ్డి సొంతంగా భరించి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆపరేషన్ అనంతరం ఇంటికి చేరుకున్న మల్లికార్జునను ఎమ్మెల్యే జెసి అష్మిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి అనేకసార్లు దాడులు చేయించి, అక్రమ కేసులు పెట్టించినా, పార్టీ మారాలని ఒత్తిడి చేసినా మల్లికార్జున తాడిపత్రి తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం విశేషంగా కృషి చేశారని ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేశారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఎమ్మెల్యే జెసి అష్మిత్ రెడ్డి అన్నారు. మల్లికార్జున కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి, త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. అవసరమైన వైద్య సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. తనకు అండగా నిలిచిన ఎమ్మెల్యే, పార్టీ నాయకులకు మల్లికార్జున కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమానికి తాడిపత్రి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చారు.

## సత్యసాయి జిల్లా కేంద్రంలో 28న యువజన విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ,

**నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు శేషాద్రి**



**మడకశిర జూలై 26 సీమ వార్త సాయంత్రం:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉషశ్రీ చరణ్ సూచనలతో, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.ఎల్. ఈరలక్కప్ప ఆదేశాల మేరకు రాష్ట్ర ఎస్ ఈ సిసభ్యులు వైసీ గోవర్ధన్ రెడ్డి , ఆదేశాల మేరకు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా పిలుపుమేరకు జిల్లా యువజన విభాగం అధ్యక్షులు సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు 2026 జూలై 28వ తేదీ ఉదయం 10:00 గంటలకు సత్యసాయి జిల్లా కేంద్రంలో యువజన విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించబడుతుంది. అని యువజన విభాగ అధ్యక్షులు శేషాద్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా యువజన విభాగం ఐదు మండలాల అధ్యక్షులు, అన్ని గ్రామ పంచాయతీల యువజన విభాగం అధ్యక్షులు, విద్యార్థి విభాగం ఐదు మండలాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై ఈ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు:**

డీఎస్సీ అభ్యర్థుల సమస్యలకు తక్షణ పరిష్కారం కల్పించాలి,

నీట్ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి,

పెరుగుతున్న నిరుద్యోగాన్ని తగ్గించేలా ఉద్యోగాల భర్తీ చేపట్టాలి,

విద్యార్థులు, యువత సంక్షేమానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి,

ప్రధాన డిమాండ్లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు శేషాద్రి తెలిపారు.

## నీటిశుద్ధి ప్లాంటు ముంజూరు



**మడకశిర జూలై 26 సీమ వార్త సాయంత్రం** నియోజకవర్గ పరిధిలోని రొల్ల మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, మరియు అగళి కేజీబీవీ పాఠశాలలకు సెంట్రల్ బ్యాంకు సౌజన్యంతో విద్యార్థుల దహార్థిని తీర్చడానికి, ఆర్వో ప్లాంట్ ముంజూరైనట్లు సెంట్రల్ బ్యాంకు అనంతపురం శాఖ సీనియర్ మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. శనివారం నాడు ఆయన మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నంతపాఠశాల, మరియు అగళి, కేజీబీవీ యందు ఒక్కొక్క ప్లాంటు రూ 170000 తో ఏర్పాటుచేసిన ప్లాంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు రవికృష్ణ, ఉపాధ్యాయులు మహాదేవప్ప, యంజారప్ప,శ్రీనివాసులు సీర్ పీ గిరిరాజు, అగళి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, నాగరత్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటి పట్టా ఇచ్చి ఆదుకోండి



**మడకశిర జూలై 26 సీమ వార్త సాయంత్రం** మండల పరిధిలోని కల్లుమరి పంచాయతీ ఎల్లోటి గ్రామానికి చెందిన శంకరప్ప ఇంటి పట్టాయి ఇచ్చి ఆదుకోవాలని తహసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చిన ఆదుకోవడంలో తదికారులు పూర్తిగా నిర్లక్ష్యమహిస్తున్నారని తెలియజేస్తున్నారు. జూరాలకు వెళితే సర్వేనెంబర్ 162 లో ఇంటి స్థలం ఇవ్వడం జరిగిందని ఆ స్థలాన్ని సబ్ డివిజన్ కూడా చేయించడం జరిగిందని, అయితే పట్టా ఇవ్వడంలో తహసిల్దార్లు పట్టించుకోవడంలేదని బాధితుడు శంకరప్ప తెలియజేస్తున్నాడు. ఎంజాయ్మెంట్ సర్టిఫికెట్ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, నాకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇల్లు మంజూరు అయిందని వెంటనే పట్టాయి ఇచ్చి ఆదుకోవాలని బాధితుడు శంకరప్ప తెలిపారు. ఇదే విషయంపై జిల్లా కలెక్టర్కు గురించి పత్రం ఇవ్వడం జరిగింది అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వెంటనే పట్టా మంజూరు చేయాలని బాధితుడు శంకరప్ప తెలియజేశారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881